క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే సమ్మె



డీఎంహెచ్ఓకు సమ్మె నోటీస్‌ను అందజేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): సమస్యల పరిష్కారం కోసం పీహెచ్‌సీల వైద్యులు సమ్మె బాట పట్టనున్నారని ప్రభుత్వ వైద్యుల సంఘ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ పెంచలయ్యకు నోటీస్‌ను పలువురు వైద్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. పీజీ అవకాశాలు తగ్గించే జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా.. టైంబాండ్ ప్రమోషన్లు.. తదితరాల కోసం ఆందోళనలను చేపట్టనున్నామని వివరించారు. ఇందులో భాగంగా వైద్యసేవలకు అంతరాయం తలెత్తకుండా బుధ, గురువారాల్లో నిరసనలు.. చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించకపోతే అత్యవసర సేవల మినహా రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్లను ఈ నెల 13న నిలిపేయనున్నామని చెప్పారు. 14న అత్యవసర సేవలను మాత్రమే చేపడతామని, 15న చలో విజయవాడ ర్యాలీ, 16న నిరవధిక దీక్షలను చేపడతామని వివరించారు.

శిశు మరణాల నివారణకు కృషి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ఆహార, ఇతర లోపాల కారణంగా సంభవించే శిశు మరణాలను అరికట్టేందుకు వైద్యులు కృషి చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య కోరారు. సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శిశుమరణాల సమీక్ష ఉప కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నుంచి మూడు నెలల్లో 14 శిశు మరణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. గర్భం దాల్చిన నాటి నుంచే వారికి ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం అందేలా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలను సమయానుకూలంగా ఇప్పించాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, పీడియాట్రీషియన్ హేమంత్, డాక్టర్లు వాసవి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాహిత్య సభ



గిరిజాలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మహాకవి పోతనామాత్యుని సాహిత్య సభను పురమందిర ప్రాంగణంలోని నెల్లూరు వర్ధమాన సమాజ హాల్లో మంగళవారం నిర్వహించారు. మోపూరు వేణుగోపాలయ్య స్మారక ధర్మనిధి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. పోతన కవితా వైభవంపై నెల్లూరు వేద సంస్కృత పాఠశాల రీడర్ గిరిజాలక్ష్మి ఉపన్యసించారు. తొలుత మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజాలక్ష్మిని సన్మానించారు. నెల్లూరు వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రామచంద్రప్రసాద్, హరిప్రియ, వెంకటస్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆట్యాపాట్యా పోటీలకు నెల్లూరు విద్యార్థి



విద్యార్థికి అభినందన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): భూటాన్‌లో గురువారం నుంచి నిర్వహించనున్న ఆట్యాపాట్యా పోటీలకు నగరంలోని బీవీఎస్ ప్రాథమికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని తుమ్మల పూజిత ఎంపికైంది. ఈ క్రమంలో స్టోన్‌హౌస్‌పేటలోని పాఠశాలలో విద్యార్థిని మంగళవారం సత్కరించిన అనంతరం ప్రధానోపాధ్యాయురాలు విజయజ్యోతి మాట్లాడారు. పాఠశాల తరఫున విద్యార్థికి రూ.23 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, పీఈటీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో రైతులు, ధాన్యం ట్రేడర్లు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల వారు జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో స్థానికంగా ఉన్న ట్రేడర్లు కుమ్మక్కై, ఇతర రాష్ట్రాల వారిని రానీయకుండా.. ధర పతనమయ్యేందుకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ పలికిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలి



నెల్లూరు సిటీ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని రూరల్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. మాదరాజుగూడూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, పప్పు దినుసులను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. శ్వేత, ఏఎన్ఎం షమీమ్, అనిత, సుమతి, రాజేశ్వరి, శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెన్లకు సత్కారం



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకొని చిన్నబజార్‌లోని రాణా ప్రతాప్ సెంటర్‌లో పోస్ట్‌మెన్లను ఆరెస్సెస్ ప్రచార విభాగ ఆధ్వర్యంలో సత్కరించారు. జయభారత్ హాస్పిటల్ జీఎం గురుప్రసాద్, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా వాసు, పోస్టల్ సూపరింటెండెంట్ కాకర్ల శ్రీనివాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రసాద్, హెడ్ పోస్ట్‌మాస్టర్ అనిల్, ఆరెస్సెస్ నేతలు సురేష్, ఉదయ్, చింతల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరంలోని గుప్తా పార్కు సెంటర్ వద్ద పార్టీ పతాకాన్ని మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వరదలతో విజయవాడ కకావికలమైందని, దీన్ని జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించే అంశంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి రూ.15 వేల కోట్లను కేటాయించామని చెప్పినా, నేటికీ రూపాయిని సైతం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పార్టీ 47, 48వ డివిజన్ల శాఖ కార్యదర్శిగా శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం నేతలు చంద్రారెడ్డి, నాగేశ్వరరావు, చిన్నయ్య, హజరత్‌బాబు, సురేష్, ఈశ్వరయ్య, బాబు, కొండయ్య, చినసుబ్బానాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22న సంగీత, నృత్య పోటీలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని టౌన్‌హాల్లో సంగీత, నృత్య పోటీలను ఈ నెల 22న నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను టౌన్‌హాల్లో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు తమ వివరాలను ఈ నెల 16లోపు నమోదు చేసుకోవాలని, సమాచారం కోసం 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రియాజ్‌బాషా, మల్లికార్జున్, రఘు రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జూడో జట్ల క్రీడాకారులకు క్రీడా దుస్తులను మంగళవారం అందజేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జూడో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం కిశోర్‌రెడ్డి, నెల్లూరు క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్ మాట్లాడారు. చెన్నైలో నిర్వహించనున్న ఖేలో ఇండియా సౌత్ జోన్ పోటీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ మహిళా జట్ల సభ్యులకు క్రీడా దుస్తులను అందజేశామని తెలిపారు. జూడో సంఘ నెల్లూరు సభ్యులు మునవీర్ హుస్సేన్, శశిధర్, ఏడుకొండలు, సాయి సుమంత్, అసోసియేషన్ సీఈఓ కేఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లో గల ఒకటో నంబర్ ప్లాట్‌ఫారమ్ వెయిటింగ్ హాల్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి.. క్రీమ్ రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. ఘటన స్థలాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నామని రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25642 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నెల్లూరు సిటీ: వినాయక నిమజ్జన ఊరేగింపు సమయంలో మద్యం మత్తులో కొందరు యువకులు వీరంగం చేశారు. వివరాలు.. నారాయణరెడ్డిపేటలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న సమయంలో కొందరు యువకులు ఆటోలో మద్యం సేవిస్తూ, స్థానికులపై దాడికి యత్నించారు. దీంతో వీరిని స్థానికులు అదుపులోకి తీసుకొని స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

ఆ కోర్సులను రద్దు చేయాలి

నెల్లూరు(అర్బన్): ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు కొత్త మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రద్దు చేయాలని, దీనికి సంబంధించిన జీఓలు 107, 108ను ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా ప్రజారోగ్య వేదిక నేతలు పంపారు.

అధికారులకు ఘన సన్మానం



నెల్లూరు (టౌన్): రవాణా శాఖలో మురళీమోహన్, కిశోర్ అందించిన సేవలు మరువలేనివని డీటీసీ చందర్ పేర్కొన్నారు. ఆర్టీఓలుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న వీరికి ఆత్మీయ వీడ్కోలు సభను నగరంలోని రవాణా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి, ఎంవీఐలు బాల మురళీకృష్ణ, రఫీ, బాబు, గోపీనాయక్, కార్తీక్, రాంబాబు, సుందర్‌రావు, ఏఎంవీఐలు కరుణాకర్, స్వప్నిల్‌రెడ్డి, రఘునాథరెడ్డి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): నగరంలోని పెద్దాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యులు కృషి చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ కోరారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ విభాగాలకు అవసరమైన పరికరాలను అందజేస్తున్నామని వివరించారు. పీడియాట్రిక్ వైద్యుల అభ్యర్థన మేరకు అక్కడ అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. డాక్టర్లు సమయపాలనను పాటించాలని కోరారు. ఆరోగ్యశ్రీలో కేసులను పెంచడంతో పాటు వివరాలను ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

అలసత్వం వహిస్తే చర్యలు

కొందరు డాక్టర్లు మధ్యాహ్నం సంతకం చేసి బయటకెళ్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అత్యవసర విభాగం వద్ద రోగులను సకాలంలో అడ్మిట్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వరద బాధితులకు విరాళం



నెల్లూరు(దర్గామిట్ట): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గానూ రూ.మూడు లక్షల విరాళాన్ని నగరంలోని మహీంద్రా అండ్ మహీంద్రా షోరూమ్ (బాలాజీ ఏజెన్సీస్ అండ్ ఇండస్ట్రీస్) నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు చెక్కును కలెక్టర్ ఆనంద్‌కు ఆయన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. షోరూమ్ మేనేజింగ్ పార్ట్‌నర్ అనుమకొండ నరేంద్రనాథ్, ఆడిటర్ మునివెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

• విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు సమకూర్చిన మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ ఆనంద్‌కు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందజేశారు. ఇస్కాన్ సిటీకి చెందిన శ్రీనివాసులు, వారి కుమారులు మోహిత్ ఈశ్వర్, చరిత్‌బాబు రూ.లక్ష.. నెల్లూరు హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,00,500.. నెల్లూరు రూరల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సమకూర్చిన రూ.లక్ష.. మొత్తం రూ.3,00,500ను చెక్కు రూపంలో ఇచ్చారు. మన్నేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ సౌగంధిక పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం పోతినాయుడుదిబ్బలో మెడికల్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువుర్ని పరీక్షించి మందులను అందజేశారు. మాజీ సర్పంచ్ పాముల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

30 టన్నుల కూరగాయల తరలింపు



వాహనాన్ని ప్రారంభిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: విజయవాడలోని వరద బాధితులకు అండగా 30 టన్నుల కూరగాయలను ఏసీ కూరగాయల మార్కెట్ వ్యాపారులు మంగళవారం అందజేశారు. దీనికి సంబంధించిన వాహనాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, రామయ్య, లక్ష్మయ్య, అజీజ్, ముక్కం నాగేశ్వరరావు, తాతిరెడ్డి, జనార్దన్, సురేష్, లక్ష్మణ్, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

స్టాఫ్ నర్సుల నిరసన



నెల్లూరు(అర్బన్): జీఓ నంబర్ 115ను రద్దు చేయడం ద్వారా తమకు న్యాయం చేయాలంటూ నగరంలోని పెద్దాస్పత్రి వద్ద పలువురు స్టాఫ్ నర్సులు మంగళవారం రెండో రోజూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీఎస్సార్ మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు, రూత్ గ్రేస్ మాట్లాడారు. మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన సమయంలో జీఓ నంబర్ 53 ప్రకారం ఇక్కడున్న పోస్టులు రెగ్యులర్‌వేనన్నారు. అయితే దీనికి విరుద్ధంగా తమను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించారని ఆరోపించారు. తాజాగా జీఓ నంబర్ 115 ద్వారా తక్కువ అర్హత ఉన్న ఏఎన్ఎంలను స్టాఫ్‌నర్సులుగా రెగ్యులర్ చేసేందుకు యత్నించడం దారుణమని చెప్పారు. తక్షణమే ఈ జీఓను రద్దు చేసి తమను క్రమబద్ధీకరించాలని కోరారు. లక్ష్మీప్రియ, శరత్‌బాబు, భారతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించరూ..



సమస్యను తెలియజేస్తున్న స్థానికులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్‌ను అందించాలని భగత్‌సింగ్‌కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో సింగిల్ ఫేజ్ సరఫరాను అందిస్తున్నారు. దీంతో రాత్రి వేళ ఇళ్లలో లైట్లు వెలగని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో లో ఓల్టేజీ రావడంతో ఏసీ, మిక్సీ, ఫ్యాన్లు సోమవారం అర్ధరాత్రి కాలిపోయాయి. దీంతో ఆగ్రహం చెందిన స్థానికులు జనార్దన్‌రెడ్డి కాలనీలోని సబ్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.

నిషేధమా.. అదెక్కడా..?

• విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
• ఎక్కడ చూసినా 20 మైక్రాన్ల కవర్లే
• పొంచి ఉన్న ప్రమాదం



కూరగాయల మార్కెట్లో ఇలా..



గచ్చు కాలువలో పేరుకుపోయిన కవర్లు

నెల్లూరు(బారకాసు): నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు నానాటికీ పేరుకుపోతున్నాయి. చెత్తకుప్పలు మొదలుకొని డ్రైనేజీ కాలువల వరకూ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి పాలిథిన్ కవర్ల విక్రయాలు జరుగుతున్నా, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడంలేదు. వీటి రీసైక్లింగ్ యూనిట్లు అతి తక్కువగా ఉండటం గమనార్హం.

ఇవీ నిబంధనలు..

తొలుత 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వినియోగించాలనే నిబంధన ఉండేది. అయితే కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2016లో కొత్త నిబంధనలు విధించింది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయో వ్యర్థాలపై సైతం ఆంక్షలు విధించింది. ఎక్కడైతే బయో వ్యర్థాలు విడుదలవుతున్నాయో, వాటి నిర్వీర్యంలోనూ సదరు సంస్థలే ప్రధానంగా బాధ్యత వహించాలని సూచించింది. అయితే ఇవేవీ జిల్లాలో అమలు కావడం లేదు. ఇటీవలి కాలంలో 20 మైక్రాన్ల మందం మాత్రమే ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. వివిధ చోట్ల వీటినే వినియోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల వరకు జరిమానా విధించాలనే ఉత్తర్వులున్నా, అదెక్కడా అమలు కావడంలేదు. అడపాదడపా దాడులకే అధికారులు పరిమితమవుతున్నారు.

నియంత్రణేదీ..?

ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. అయితే ఆ శాఖ పట్టించుకున్న దాఖలాల్లేవని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్ద మాళ్లలో సైతం 20 మైక్రాన్ల బ్యాగులను వినియోగిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువవుతున్నారు.

నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. తరచూ డ్రైవ్‌లు చేపడుతున్నాం. సామాజిక స్పృహతో ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలి.

– చైతన్య, హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

ప్రమాదకరం

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం. ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం, వాటిని తినడం ద్వారా కేన్సర్ సోకే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి.

– డాక్టర్ జీజియాబాయి, యూడబ్ల్యూఎఫ్ఓ, నగరపాలక సంస్థ